

శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,78,568, బంగారం 20 మిల్లీగ్రాములు, వెండి 50 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



ముహూర్తం ఖరారు

- ఈనెల 18న పూరీ–హౌరా సెమీ హైస్పీడ్ రైలు ప్రారంభించనున్న ప్రధాని మోదీ

-8లో

పనుల్లో జాప్యంపై ఆందోళన



బరంపురం: నగర శివారు నిమ్మఖం డి–రేడియో స్టేషన్ మధ్య జరుగుతున్న రహదారులు, కాలువల పెండింగ్ పనులు వర్షాల సీజన్‌కు ముందే పూర్తి చేయాలని గంజాం అభివృద్ధి వికాశమంచ్ అధ్యక్షుడు శివప్రసాద్ మిశ్రా కోరారు. ఈ మేరకు బరంపురం సూపర్ ఇంజినీర్ కార్యలయం ఎదుట ఆందోళన చేపట్టారు.

న్యూస్‌రీల్

పర్లాకిమిడి బంద్ వాయిదా



రిలే దీక్ష చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

పర్లాకిమిడి: జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థిని సౌధామిని రైతో కళాశాలలో ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సీపీఐ(ఎం) నాయకులు ఈనెల 17న(బుధవారం) బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అయితే నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నట్లు పార్టీ పర్లాకిమిడి పట్టణ అధ్యక్షుడు ధూపాన వెంకట్రావు మంగళవారం ప్రకటించారు. విద్యార్థిని తల్లి, బంధువులు గత 20రోజులుగా జిల్లా కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు మేరకు సీఎం కార్యాలయం నుంచి సానుకూల స్పందన ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బంద్‌ను వాయిదా వేస్తున్నామని వివరించారు.

ముగిసిన హనుమాన్ జయంతి ఉత్సవాలు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

రాయగడ: పట్టణంలోని బాలాజీ నగర్ కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో గత 3రోజులుగా నిర్వహిస్తున్న హనుమాన్ జయంతి ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు, రాంజీ ఆచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో భాగంగా ఉదయం సుందరాకాండ పారాయణం, తమలార్చన, సింధూర పూజలు చేపట్టారు. ముగింపోత్సవాల్లో హనుమత్ హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

నేడు బొనాకొ లగ్గి



భువనేశ్వర్: జ్యేష్ఠమాసం కృష్ణపక్ష త్రయోదశి పురస్కరించుకుని పూరీ జగన్నాథునికి బొనాకొ లగ్గి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీమందిరం రత్నవేదికపై కొలువుదీరి, నిత్యం పూజలందుకుంటున్న మూల విరాట్‌ల ముఖాల అలంకరణ చేపడతారు. దైనందిన ధూపదీపాదులతో మసకబారిన స్వామివార్ల ముఖాల అలంకరణ మెరుగు దిద్దుతారు. బుధవారం ద్వితీయ భోగ మండపసేవ అనంతరం ఈ సేవ ప్రారంభిస్తారు. సాయంత్రం 6గంటల నుంచి ఆరంభమై సుమారు రాత్రి 10గంటల వరకు మూల విరాట్‌ల ముఖ అలంకరణ(బొనాకొ లగ్గి) నిరవధికంగా కొనసాగుతుంది. ఈ వ్యవధిలో సాధారణ భక్తులు, యాత్రికులకు మందిర ప్రవేశం నివారించి సర్వదర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తారని శ్రీమందిరం దేవస్థాన అధికార వర్గాలు తెలిపాయి.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



ఏడీఎం రాజేంద్రమింజ్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకేఎంయూ నాయకులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని పలు మౌజాలలో ఇంటి స్థలాలు వ్యవసాయ కూలీలకు మంజూరు చేయాలని డిమాండు చేస్తూ భారతీయ ఖేత్ మజ్దూర్‌సంఘ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. జిల్లాలోని దేవీది మౌజా, గుమ్మా, బెత్తగుడ, కాశీనగర్ తహసీల్ పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని ఇళ్లు లేని పేదలకు, వ్యవసాయ కార్మికులకు కేటాయించాలని బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు జెన్న సుభాష్ చంద్రరావు కోరారు. అనంతరం ఏడీఎం రాజేంద్ర మింజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.జగన్నాథం, న్యాయవాది కామేశ్వర బెహరా, కె.సావిత్రమ్మ, అశ్వినీ గమాంగో, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

రాజుకున్న కలహాలు!

- వీధినపడిన బొలంగీర్ రాజ కుటుంబికుల అంతర్గత విబేధాలు
- అర్కేష్ సింఘ్‌దేవ్–అద్రిజా దంపతుల మధ్య వివాదం
- గృహహింస ఆరోపణలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



కుటుంబ సభ్యులతో అర్కేష్–అద్రిజా పెళ్లినాటి ఫొటో

భువనేశ్వర్: బొలంగీర్ జిల్లా రాజ వంశీకుల కుటుంబ కలహాలు వీధికెక్కాయి. ఈ కుటుంబంలో యువరాజు అర్కేష్ నారాయణ సింఘ్‌దేవ్ దంపతుల వివాదం రాజభవనం దాటి పోలీసు ఠాణాకు చేరింది. అర్కేష్ వ్యతిరేకంగా ఆయన భార్య అద్రిజా గృహహింస ఆరోపణతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలను అర్కేష్ సింఘ్‌దేవ్ ఖండించారు. దాదాపు 6నెలల క్రితం ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ నేపథ్యంలో తాను ఇల్లు వదిలి వెళ్లిపోయానని ఆయన తెలిపారు. 'ఆమె నాపై గృహహింస కేసు పెట్టడంతో నేను ఇల్లు వదిలి వెళ్లిపోయాను. ప్రస్తుతం, ఆమె సోదరి అక్కడ నివసిస్తున్నారు. ఆమె తండ్రి కూడా ప్రతినెలా 15 రోజులు రాజ భవనాన్ని సందర్శించేవారు. అవసరమైన వస్తువులు తీసుకునేందుకు నెలకోసారి మాత్రమే ఇంటికి వెళ్తున్నాను. పోలీసుల సలహా మేరకు ఆమె, నా భద్రతను నిర్ధారించడానికి ఇంట్లో సీసీటీవీ కెమెరాను ఏర్పాటు చేయించా. అయితే వాటిని అద్రిజా ధ్వంసం చేశారు. దీనికి సంబంధించిన వీడియోను పోలీసులకు పంపించా'నని అర్కేష్ వివరించారు. మూడు రోజుల క్రితం అద్రిజా తండ్రి తమ వద్దకు వచ్చి చేసిన డిమాండ్ పట్ల ప్రతికూలించినట్లు అర్కేష్ నారాయణ సింఘ్‌దేవ్ తెలిపారు. వివాదం కోర్టు విచారణ పరిధిలో ఉన్నందున న్యాయస్థానం నిర్ణయం మేరకు కొనసాగడం జరుగుతుందని పదే పదే ప్రాధేయపడినా.. ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని, సహరాపూర్‌లోని కొందరు ల్యాండ్ మాఫియాతో తన మామకు సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. తన ఇంటిపైకి దౌర్జన్యంగా 10మంది వ్యక్తులను పంపించారని, ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించగా.. అవసరమైతే 100 మందితో వస్తానని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. అద్రిజా ఓ న్యూస్ ఛానెల్‌తో మాట్లాడుతూ తన భర్త 2022 ఆగస్టులో విడాకులు కోరినట్లు తెలిపారన్నారు.

డీజీపీని కలిసి..

ఇదిలా ఉండగా.. అర్కేష్ సింఘ్‌దేవ్ భార్య అద్రిజా భర్తతో పాటు మామ అనంగ ఉదయసింఘ్ దేవ్, బావ కళికేష్ నారాయణ్ సింఘ్‌దేవ్, అత్త విజయ లక్ష్మీదేవి, మేఘనా రాణా లపై 2022 సెప్టెంబర్ 30న రాజ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అత్తింటి వారు తనను ఇంటి నుంచి బయటకు నెట్టేయాలని, ఒడిశాను సందర్శించకుండా అడ్డుకోవాలని ప్రయత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మెట్టినింటి వారి సిబ్బంది కూడా దుర్భాషలాడుతూ గోప్యతకు భంగం కలిగించడంతో పాటు తన గదివైపు కెమెరా ఏర్పాటు చేసి ప్రతి కదలికపై నిఘా ఏర్పాటు చేశారని ఆరోపించారు. అయితే తన ఫిర్యాదుపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె ఇటీవల ఉత్తరాఖండ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) సునీల్ బన్సాల్‌ను కలిశారు. ఈ కేసును ప్రస్తుతం డెహ్రాడూన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఏస్పీ)కి అప్పగించారు.

వీపీ సింగ్ మనుమరాలు..

అర్కేష్ సింఘ్‌దేవ్ గతంలో కాంట్రాక్ట్ కిల్లర్‌తో తనను చంపడానికి ప్రయత్నించారని అద్రిజా డెహ్రాడూన్ లోని స్థానిక మీడియాకు వివరించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని పోలీసుల వద్దకు వెళ్లి, రక్షణ కోరారు. మాజీ ప్రధానమంత్రి విశ్వనాథ్ ప్రతాప్‌సింగ్(వీపీ సింగ్) మనవరాలైన అద్రిజా ప్రస్తుతం తన కుటుంబ సభ్యులతో ఉత్తరాఖండ్‌లో ఉంటున్నారు. అర్కేష్, అద్రిజాల 2017 నవంబర్‌లో జరిగింది.



అర్కేష్ నారాయణ సింఘ్‌దేవ్ దంపతులు(ఫైల్)

మేట్రిమొనీలో మోసం

- నాల్కోలో డీజీఎంగా పరిచయం చేసుకున్న యువకుడు
- వివాహానంతరం మోసం గ్రహించిన ఓఏఎస్ అధికారిని





నిందితుడు హరిహర రథొ

జయపురం: ఆన్‌లైన్ వివాహ పరిచయ వేదిక మోసాలు రోజురోజుకూ కొనసాగుతున్నాయి. తాజాగా ఇటువంటి ఘటనే స్థానిక పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. దీనిపై బాధిత యువతి జయపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వాస్తవం వెలుగు చూసింది. పట్టణంలోని లింగరాజ్‌నగర్‌కు చెందిన రాధానాథ్ రథొ కుమారుడు హరిహర రథొ తాను నాల్కో ఢిల్లీ డివిజన్ కార్యాలయంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌నని మేట్రిమొనీలో పరిచయం చేసుకున్నాడు. ఢిల్లీలోని నోయిడాలో నివసిస్తున్నట్లు చిరునామా ఇచ్చాడు. దీనిని విశ్వసించిన స్థానిక పారాబెడ లోని శ్రీరామనగర్‌కు రాజారాం సింగ్ పెద్ద కుమార్తె, ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ అధికారి రీతూ సింగ్ సంబంధం కుదుర్చుకున్నారు. ఫిబ్రవరి 9న జయపురంలోని కల్యాణ మండపంలో బంధువుల సమక్షంలో వీరి వివాహం జరిగింది. అయితే 3 నెలలైనా భర్త ఉద్యోగం విషయం, ఉంటున్న ప్రాంతంపై సంతృప్తికరమైన వివరాలు తెలియలేదు. ఈనెల 12 రాత్రి ఢిల్లీలో ఉన్న భర్తకు ఫోన్ చేసి, ఇంటి లొకేషన్ పంపించాలని కోరగా అతని నుంచి ఎటువంటి సమాచారం రాలేదు. దీంతో మేట్రిమొనీలో ఇచ్చిన వివరాలు నిజం కాదని గ్రహించిన వధువు కుటుంబ సభ్యులు గ్రహించారు. మరోవైపు అత్తమామలు, ఆడబడుచులు పదేపదే డబ్బు తీసుకు రావాలని వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ మేరకు పట్టణ పోలీసు స్టేషన్‌లో రీతూ సింగ్ ఫిర్యాదు చేయగా, పోలీసులు హరిహర కుటుంబ సభ్యులను పిలిపించి, వివరాలు సేకరించారు. అయితే నిందితుడి ఫోన్ స్విచాఫ్ అని రావడంతో దర్యాప్తు చేపడుతున్నట్లు పట్టణ పోలీసు అధికారి సంభిత్ బెహర వెల్లడించారు.

చిక్కుల్లో బీజేడీ ఎమ్మెల్యే శశిభూషణ్ బెహరా

- వరకట్న వేధింపుల ఆరోపణతో పోలీస్ స్టేషన్‌లో కోడలి ఫిర్యాదు



కుమారుడి పెళ్లి పందిరిలో ఎమ్మెల్యే శశిభూషణ్ బెహరా (ఫైల్)

భువనేశ్వర్: కేంద్రపడా నియోజకవర్గ ఎమ్మెల్యే, అధికార పార్టీ బిజూ జనతాదళ్ నాయకుడు, మాజీమంత్రి శశిభూషణ్ బెహరా చిక్కుల్లో పడ్డారు. అతని కుటుంబం గృహహింస, వరకట్న వేధింపులు పెడుతున్నారని కోడలు రోనాలి బెహరా(31) బంకి ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2021 మార్చి 3న ఎమ్మెల్యే కుమారుడు సత్యప్రకాష్‌తో ఆమెకు వివాహం జరిగింది. అయితే తన భర్త మరో వివాహితతో సంబంధం కలిగి ఉన్నాడని, సత్యప్రకాష్ తోపాటు అత్తమామలు, ఆడపడుచులు, ఇతర కుటుంబీకులు మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఆర్థిక అవసరాలు తీర్చాలని నిరంతరం వేధిస్తున్నారని, తల్లిదండ్రుల నుంచి రూ.40 లక్షలు తీసుకు రావాలని ఒత్తిడి చేశారని ఆరోపించారు. మెట్టినింటికి వచ్చిన 10 రోజులకే పుట్టింటి వారు ఇచ్చిన నగలన్నీ తమకు అప్పగించాలని డిమాండ్ చేశారన్నారు. చెప్పినట్లు వినలేదని దుర్భాషలాడి, మానసికంగా కుంగదీశారని వాపోయారు. అయితే తన కోడలు చేసిన ఆరోపణలను నిరాధారమైనవి, అంతా అవాస్తవమని ఎమ్మెల్యే శశిభూషణ్ కొట్టిపారేశారు. తన కొడుకు, రోనాలి మధ్య కొన్ని విభేదాలు ఏర్పడి ఉండవచ్చన్నారు. మెట్టినింటికి వచ్చిన తర్వాత నామమాత్రంగా నెల రోజులు మాత్రమే ఆమె తమతో ఉన్నారని, అనంతరం తన తండ్రితో కలిసి పుట్టినింటికి వెళ్లి తిరిగి రాలదేని తెలిపారు. వరకట్న డిమాండ్ ఆరోపణలు నిరాధారమైనవని స్పష్టంచేశారు.

విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలి

- అధికారులకు కొరాపుట్ ఎంపీ సప్తగిరి సూచనలు
- ప్రకృతి విపత్తులపై సమీక్ష సమావేశం



ప్రసంగిస్తున్న ఎంపీ సప్తగిరి ఉలక



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: ప్రాకృతిక విపత్తులు సంభవించినప్పుడు వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేలా అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రాకృతిక విపత్తులు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రాకృతిక విపత్తుల్లో భాగంగా వర్షాలు, వరదలు, తుఫానులు చెప్పిరావని, దీనిని దృష్టిలో పెట్టుకొని ముందుగానే సంసిద్ధమై ఉండాలన్నారు. ఏటా వర్షాకాలంలో నదీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. జిల్లాలోని వంశధార, నాగావళి తదితర నదులు ప్రవహిస్తున్నాయని గుర్తు చేశారు. వాటికి సమీపంలోని గ్రామాలు, నదీ పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలకు వర్షాకాలంలో వరదల బారి నుంచి రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించే విషయంలో సంబంధిత శాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ భవనాలు, వంటివి సిద్ధ చేసుకోవాలన్నారు. రానున్న వర్షాల సీజన్‌లో ముందస్తు చర్యలుగా అవసరమయ్యే కిరోసిన్, అటుకులు, బెల్లం, టార్పాలిన్లు తదితరమైన వస్తువులను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా నదుల సమీపంలో రక్షణ గోడలు, నిర్మించాలని, వర్షాలు సంభవించే సమయంలో ధన, ప్రాణనష్టాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు.

ముందుగానే సిద్ధం కావాలి..

ఇదిలా ఉండగా జిల్లాలో అత్యధిక శాతం గ్రామాలు ఉన్నాయని, ఇందులో దాదాపు గ్రామాలు వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరమవుతుంటారని నదీ అవతలి వైపు ఉండే గ్రామాల్లో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఎంపీ ఉలక సూచించారు. రాకపోకలు పూర్తిగా స్తంభించిన గ్రామాలు జిల్లాలో కోకొల్లలని తెలిపారు. అటువంటి గ్రామాలను వర్షాకాలం ముందుగానే గుర్తించి, ఆయా గ్రామాలకు సకాలంలో వైద్య సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి అవసరమయ్యే మందులు ఆయా ప్రాంతాలకు ముందుగానే తరలించాలని సూచించారు. వర్షాకాలం రాకముందే రహదారులు తదితరమైనవి మెరుగు పరుచుకుంటే రాకపోకలకు ఇబ్బందులు ఉండవన్నారు. తద్వారా ప్రజలకు అవసరమయ్యే సౌకర్యాలను సమకూర్చే అవకాశం కలుగుతుందని వివరించారు. సమావేశంలో ఏడీఎం సోమనాథ్ ప్రధాన్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, బీడీఓలు హాజరయ్యారు.

'దివ్యాంగులపై వివక్ష తగదు'



కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన దివ్యాంగులు



సామాజిక, సురక్షా అధికారితో మాట్లాడుతున్న దివ్యాంగుడు హిమిరిక

రాయగడ: రాష్ట్రప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు వారిని ఎంతో గౌరవిస్తోందని, అయితే వాటి అమలులో అధికారులు మాత్రం వివక్ష చూపిస్తున్నారని జిల్లా దివ్యాంగుల సంఘం ఆరోపించింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌చంద్ర హిమిరిక ఆధ్వర్యంలో దివ్యాంగులు మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తిచూపుతూ నిరసనకు దిగారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించిన జిల్లా సామాజిక సురక్ష అధికారికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఏదైనా పనిపై సంబంధిత కార్యాలయానికి వెళ్లిన వారికి అవమానమే ఎదురవుతుందని వాపోయారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ కోసం బ్యాంకులకు వెళ్తే పదే పదే తిప్పుతున్నారని, గతంలో తరహాలో పంచాయతీల ద్వారా పెన్షన్ అందేలా చూడాలని కోరారు. అదేవిధంగా తమను అనునిత్యం అవమానిస్తున్న అధికారులపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో దివ్యాంగులు ఆందోళన చేపట్టిన ప్రాంతానికి జిల్లా అదనపు మేజిస్ట్రేట్ సోమనాథ్ ప్రధాన్ వెళ్లి నచ్చజెప్పినప్పటికీ వారు నిరసన విరమించలేదు. దీంతో జిల్లా సామాజిక సురక్షా అధికారి సురేంద్ర గమాంగోను పిలిపించి, దివ్యాంగులకు క్షమాపన చెప్పించడంతో అంతా శాంతించారు. ఈ సందర్భంగా ఏడీఎం మాట్లాడుతూ ఇంతవరకు పెండింగ్‌లో ఉన్న దివ్యాంగుల పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారికి ఆదేశించారు.

రేపు మెట్రిక్ ఫలితాల వెల్లడి

- ఉదయం 10 గంటలకు ప్రకటించనున్న విద్యాశాఖ మంత్రి



విలేకర్లతో మాట్లాడుతున్న బోర్డు అధ్యక్షుడు రమాశిష్

భువనేశ్వర్: రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు(బీఎస్ఈ) ఈ ఏడాది నిర్వహించిన మెట్రిక్(పదో తరగతి) వార్షిక పరీక్ష ఫలితాలు ఈనెల18న గురువారం వెల్లడించనున్నారు. ఈ మేరకు కటక్ బోర్డు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో బోర్డు అధ్యక్షుడు రమాశిష్ హజ్రా విషయాన్ని తెలియజేశారు. గురువారం ఉదయం 10 గంటలకు విద్యాశాఖ మంత్రి, కార్యదర్శి సమక్షంలో మెట్రిక్ పరీక్ష ఫలితాలను ప్రకటిస్తామన్నారు. బీఎస్ఈ ఉపాధ్యక్షుడు డాక్టర్ నిహార్ రంజన్ మహంతి మాట్లాడుతూ మెట్రిక్ పరీక్ష ఫలితాలు మధ్యాహ్నం 12 గంటలలోగా అందరికీ అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. బోర్డు వెబ్‌సైట్, మొబైల్‌లో ఎస్ఎంఎస్ ద్వారా ఫలితాలు తెలుసుకోవచ్చని, www.bseodisha.ac.in లో ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ నుంచి 56767508 ఓఆర్10 అని టైప్ చేసి, విద్యార్థి రోల్ నంబర్‌ను ఎస్ఎంఎస్ పంపిచడం ద్వారా పరీక్షా ఫలితాలను పొందవచ్చని సూచించారు. ఈ ఏడాది సమగ్రంగా 5 లక్షల 18వేల మంది అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 3,218 పరీక్షా కేంద్రాల్లో పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో మెట్రిక్, మాధ్యమ, ఓపెన్ స్కూల్ పరీక్షలు రాసేందుకు మొత్తం 5,41,247 మంది దరఖాస్తు దాఖలు చేశారు. ప్రశ్నపత్రాల భద్రత, ఇతరేతర నిర్వహణ కార్యకలాపాల కోసం 316 నోడల్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 55 మూల్యాంకన కేంద్రాల్లో పరీక్షల జవాబు పత్రాలు దిద్దారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ 3న ప్రారంభమై 12 రోజుల పాటు నిరవధికంగా కొనసాగింది. మూల్యాంకనంలో తప్పులు తడకలు నివారించేందుకు అనుబంధ యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపట్టిందని బోర్డు అధికారులు వివరించారు.

డెంగీ నివారణకు చర్యలు

- ప్రచార రథాన్ని ప్రారంభించిన ఆరోగ్యశాఖ



అవగాహన శిబిరంలో పాల్గొన్న సీడీఎంఓ, అధికారులు

పర్లాకిమిడి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా స్వాస్థ్య సమితి ఆధ్వర్యంలో జిల్లా ముఖ్య వైద్యాధికారి కార్యాలయం నుంచి ప్రచార రథాన్ని మంగళవారం ప్రారంభించారు. సీడీఎంఓ(పబ్లిక్‌హెల్త్) డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రొ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అలాగే పర్లాకిమిడిలోని వార్డు నంబర్ 1, సంజయ్‌గాంధీ కాలనీలో ఏఎన్ఎం వనజా వాసిని డెంగీ తీవ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ర్యాలీలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. దీనితో పాటు గుసాని, కాశీనగర్, గుమ్మా సమితి స్వాస్థ్య కేంద్రాల్లో సచేతన ర్యాలీలు, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా ముఖ్యవైద్యాధికారి కార్యాలయంలో విద్యార్థులతో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో డీపీహెచ్ఓ డాక్టర్ ముబారక్ అలీ, డీఎంఓ డాక్టర్ ప్రమోద్‌కుమార్ పండా, పబ్లిక్‌హెల్త్ అదనపు అధికారి డాక్టర్ ఇందిరా మహాపాత్రొ, డాక్టర్ ఆనందచంద్ర సామంతరాయ్, జాతీయ స్వాస్థమిషన్, డీపీఎం సౌమ్యరాణి గౌడొ తదితరులు పాల్గొన్నారు.



డెంగీపై చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్లుప్తంగా

కారు బోల్తా


బోల్తాపడిన కారు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల సమీపంలో పాత జాతీయ రహదారి పక్కన మంగళవారం కారు బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వస్తుండగా అదుపు తప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో డ్రైవర్, మరొకరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు, హైవే సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు.

అరబిందో ఫార్మాలో ఉద్యోగాలకు జాబ్‌మేళా

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని బలగ హాస్పిటల్ జంక్షన్‌లో ఉన్న డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణా సంస్థలో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి జి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అరబిందో ఫార్మా కంపెనీలో 250 ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రొడక్షన్, క్యూసీ, ఇంజినీరింగ్, తదితర ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ పాస్/ఫెయిల్, డిప్లమో, కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎంఫార్మసీ, బీఫార్మసీ, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ పాస్/ఫెయిల్, ఐటీఐ మెకానికల్ ఫిట్టర్, ఎలక్ట్రికల్ తదితర విద్యార్హతలు కలిగి 19 నుంచి 26 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10 గంటలకు డీఎల్‌టీసీ శిక్షణా సంస్థ వద్దకు బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో హాజరుకావాలని కోరారు.

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కోటబొమ్మాళి: మండలంలోని చవితిపేట సమీపంలో పెద్దచెరువులో మునిగి గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. మృతుడు నీలంరంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు వారు పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ కోరారు.

సజావుగా ఏపీ ఈఏపీసెట్

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ -2023 (ఏపీ ఈఏపీ సెట్- 2023 పరీక్ష రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. మంగళవారం మూడు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 190 మందికి 184 మంది, రెండో షిఫ్టులో 190 మందికి 183 మంది, ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 190 మందికి 184 మంది, రెండో షిఫ్టులో 190 మందికి 185 మంది, టెక్కలిలోని ఐతం కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 230 మందికి 217 మంది, రెండో షిఫ్టులో 230 మందికి 220 మంది హాజరయ్యారు.

వడదెబ్బకు వృద్ధుడి మృతి


సింహాచలం (ఫైల్)

ఆమదాలవలస రూరల్: మండలంలోని కొర్లకోట గ్రామానికి చెందిన పేడాడ సింహాచలం (63) వడదెబ్బకు గురై మంగళవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామ సమీపంలో ఉన్న సాగరం చెరువు వద్ద చేపల కొనుగోలుకు వెళ్లి ఇంటి వచ్చాడు. వెంటనే స్పృహ తప్పి కుప్పకూలిపోవడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందజేశారు. సిబ్బంది వచ్చి వాహనంలోకి ఎక్కించేసరికే సింహాచలం మృతిచెందాడు. మృతునికి భార్య చిలకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కెల్లవీధిలో నివాసముంటున్న ఓ వివాహిత రిమ్స్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందినట్లు శ్రీకాకుళం రెండో పట్టణ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపారు. కానుకుర్తి వీధిలో నివాసముంటున్న బండి జయమ్మ, చిన్నారావు దంపతుల కుమార్తె దేవి(34)ని కృష్ణాపార్కుకు చెందిన జమ్మూ లక్ష్మణరావుతో పదహారేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి 15 ఏళ్ల కుమారుడున్నాడు. కొంతకాలంగా వీరు కెల్లవీధిలో నివాసముంటున్నారు. లక్ష్మణరావు ప్లంబింగ్ చేస్తుండేవాడు. మద్యానికి బానిసయ్యాడు. కుమారుడి భవిష్యత్తు కోసం డబ్బులు దాయాలని చెప్పినా భర్త తీరు మారకపోవడంతో మనస్థాపానికి గురైన దేవి సోమవారం సాయంత్రం సూపర్ వాస్‌మల్-33 తాగేయడంతో బంధువులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించారు. మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందింది. దేవి తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

ముహూర్తం ఖరారు



- పూరీ-హౌరా మధ్య వందేభారత్ సెమీ హైస్పీడ్ రైలు
- ఈనెల 18న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోదీ

భువనేశ్వర్: పూరీ-హౌరా వందేభారత్ సెమీ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల ప్రారంభ ముహూర్తం ఖరారైంది. ఈనెల 18న ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ రాజధాని ఢిల్లీ నుంచి వర్చువల్‌గా హాజరై, జెండా ఊపి ప్రారంభించనుండగా.. పూరీ రైల్వేస్టేషన్‌లో జరగనున్న కార్యక్రమంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, మానవాభివృద్ధి శాఖామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రత్యక్షంగా హాజరు కానున్నారు. ఒడిశాకు ఇది తొలి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కాగా.. పశ్చిమ బెంగాల్‌కు రెండో రైలు కావడం విశేషం. పూరీ-హౌరా రైల్వేస్టేషన్ల మధ్య ఈ రైలు గురువారం మినహా వారానికి 6 రోజులు నడుస్తుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య ఏడు ప్రధాన రైల్వే స్టేషన్లలో(భువనేశ్వర్ మినహా) 2 నిముషాల చొప్పున ఆగుతుందని రైల్వేశాఖ మంగళ వారం తెలిపింది. భువనేశ్వర్‌లో 4 నిముషాల చొప్పున ఆగుతుంది. 16 కోచ్‌లతో కూడిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నుంచి ఉదయం 6.10 గంటలకు బయలుదేరి ఒడిశాలోని పూరీకి మధ్యాహ్నం 12.35 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 1.50 గంటలకు పూరీ నుంచి బయలుదేరి రాత్రి 8.30 గంటలకు హౌరా చేరుతుంది.

ఎక్కడెక్కడ..?

ఖరగ్‌పూర్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్-కెంజొహర్ రోడ్డు, కటక్, భువనేశ్వర్, ఖుర్దా రోడ్ స్టేషన్లలో వందేభారత్ రైలు ఆగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ 28న హౌరా, పూరీ మధ్య వందేభారత్ సెమీ హైస్పీడ్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ పూరీ, కటక్ రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన జరగనుంది. బిచ్చుపల్లి-జర్తర్ప కొత్తలైన్ ప్రారంభించి సంబల్‌పూర్-టిట్లాగఢ్ డబ్లింగ్, అంగుల్-సుకింద కొత్తలైన్, మనోహర్‌పూర్-రూర్కెలా-ఝర్సుగూడ-జమ్గా మూడోలైన్ ప్రజాసేవకు అంకితం చేయనున్నారు.

రాకపోకల వేళలు..

హౌరా-పూరీ (22895) రాక/పోక	స్టేషన్	పూరీ-హౌరా (22896) రాక/పోక
--/6.10	హౌరా	20.30/--
07.40/07.42	ఖరగ్‌పూర్	18.42/18.44
09.03/09.05	బాలాసోర్	17.13/17.15
09.40/09.42	భద్రక్	16.33/16.35
10.07/10.09	జాజ్‌పూర్-కెంజొహర్ రోడ్	16.03/16.05
10.50/10.52	కటక్	15.15/15.17
11.20/11.24	భువనేశ్వర్	14.45/14.49
11.42/11.44	ఖుర్దారోడ్	14.23/14.25
12.35/--	పూరీ	--/13.50

ముంపు ప్రమాదం లేకుండా రోడ్డు


రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎస్ఈ తిరుమలరావు

టెక్కలి: మూలపేట పోర్టుకు టెక్కలి జాతీయ రహదారి నుంచి వేస్తున్న రోడ్డు వల్ల ప్రభావిత ప్రాంతాలకు ఎలాంటి ముంపు ప్రమాదం లేకుండా చూసుకుంటామని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. పోర్టు రోడ్డు వల్ల ప్రభావిత గ్రామాల్లో పంట పొలాలకు ముంపు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటన చేయాలని ఇటీవల ప్రభావిత గ్రామాల రైతులు సబ్ కలెక్టర్‌ను కోరారు. దీంతో సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, వంశధార ఎస్ఈ డోల తిరుమలరావుతో పాటు రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, పోర్టు నిర్మాణ కాంట్రాక్టర్ సిబ్బందితో కలిసి మంగళవారం టెక్కలి సమీపంలో పోర్టు రోడ్డు ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎగువ ప్రాంతంలో ఉన్న మదన గోపాలసాగరం నుంచి వరదల సమయాల్లో దిగువ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ముంపు ప్రమాదం వస్తోందని గుర్తు చేశారు. ఇప్పుడు పోర్టు కోసం భారీగా రోడ్డు వేస్తే ఆ ప్రమాదం మరింత జటిలంగా మారే అవకాశం ఉందని ఆయా రైతులు పేర్కొన్నారు. దీనిపై సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం పోర్టు నిర్మాణం చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న భూములకు పుష్కలంగా సాగునీరు అందే విధంగా సంబంధిత వంశధార అధికారులు కల్వర్టులు నిర్మిస్తారని పేర్కొన్నారు. అనంతరం రైతుల కోరిక మేరకు మదనగోపాల సాగరాన్ని పరిశీలించారు.

ఈ పరిశీలనలో వంశధార ఈఈ కె.శ్రీకాంత్, తహసీల్దారు బి.గిరి తో పాటు ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నారు.


విజయదుర్గమ్మకు లక్ష పుష్పార్చన


నగరంలోని నానుబాలువీధిలో విజయదుర్గ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ, ఫణికుమార్ శర్మల ఆధ్వర్యంలో కనకాంబరాలతో లక్ష పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

-శ్రీకాకుళం అర్బన్

గడప గడపలో భద్రత

కుంటిభద్ర ప్రత్యేకత


కుంటిభద్ర గ్రామం



- ఉద్యోగాలు, స్వయం ఉపాధి కల్పనలో ఆదర్శంగా నిలుస్తున్న కుంటిభద్ర
- ప్రతి మూడిళ్లకు ఒక ప్రభుత్వ ఉద్యోగి
- స్వయం ఉపాధిలోనూ వారిది అందెవేసిన చేయి
- మారుతున్న గ్రామ రూపురేఖలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఆ గ్రామంలో 800 గడపలు ఉన్నాయి. అందులో ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 150 కుపైనే. వెనుకబడిన కొత్తూరు మండలంలోని కుంటిభద్ర అనే కుగ్రామంలోని గణాంకాలివి. ఇక్కడ యువత ఊరి తీరును మారుస్తున్నారు. కష్టపడి కొలువులు సాధిస్తూ వెనుకబాటు ముద్రను చెరిపేస్తున్నారు. తమ కాళ్లపై నిలబడి ఉద్యోగం సాధించడం, లేదంటే స్వయం ఉపాధి చూసుకుంటూ ఇక్కడి యువత ఆదర్శంగా నిలుస్తున్నారు.

కుంటిభద్రలో ఏ ఒక్కరూ ఖాళీగా ఉండరు. ప్రతి మూడిళ్లకు ఒక ఉద్యోగస్తుడు కనిపిస్తాడు. పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. చదువు పూర్తయి వారు ఉద్యోగ అన్వేషణలో పడి సత్తా చాటుతున్నారు. ఎవరికైనా ఉద్యోగం రాకపోతే దాని కోసం సమయాన్ని వృధా చేసుకోరు. స్వయం ఉపాధి పొందేలా తయారవుతున్నారు. ఏదో ఒక రంగంపై అవగాహన పెంచుకుని ఉపాధి పొందుతున్నారు. దాదాపు 800 గడపలున్న గ్రామంలో 150కిపైగా వివిధ ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

కొలువుల్లో కుంటిభద్ర..

ఈ గ్రామం చిన్నదైనప్పటికీ ఆదర్శంలో పెద్దదిగా నిలిచింది. పోటీ ప్రపంచాన్ని తట్టుకుని ముందుకు సాగుతోంది. తల్లిదండ్రుల మాటలను ధిక్కరించకుండా, వారి ఆశలను నిజం చేస్తూ అక్కడి యువత తమ భవిష్యత్‌కు సరికొత్త బాటలు వేసుకుంటోంది. ఎవరి మీదా ఆధారపడకుండా ఉద్యోగాలు సాధించడమే కాకుండా స్వయంగా కష్టపడి ఉపాధి అవకాశాలను పెంచుకుంటోంది. ఇక్కడి యువత దాదాపు ప్రతి శాఖలోనూ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. దాదాపు 12 మంది ఉపాధ్యాయులుగా పనిచేస్తుంటే, 14 మంది వరకు రైల్వే ఉద్యోగులగా విధులు నిర్వర్తిస్తున్నారు. 10మందికి పైగా బ్యాంకు ఉద్యోగులుండగా, రెవెన్యూ, సచివాలయం ఉద్యోగులు 10మందికి పైగా ఉన్నారు. డిఫెన్స్ రంగంలోనైతే గ్రామంలో 60 మంది వరకు పనిచేస్తున్నారు. వైద్య రంగంలో ముగ్గురు, గ్రూపు-2 కొలువుల్లో ఇద్దరు, పోలీసు, ఇతరత్రా ఉద్యోగాల్లో మరికొంతమంది పనిచేస్తున్నారు. దాదాపు 150 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఈ గ్రామంలో ఉన్నారు.



స్వయం ఉపాధిలోనూ..



కుంటిభద్ర గ్రామం స్వయం ఉపాధిలోనూ తిరుగులేకుండా ఉంది. అక్కడున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగం రాకపోతే నిరాశతో కుమిలిపోరు. తమ కాళ్లపై నిలబడి వ్యక్తిగత నైపుణ్యం సాధించి ఉపాధి పొందుతున్నారు. 30మందికి పైగా బోర్ మెకానిక్, ప్లంబర్లుగా పనిచేస్తున్నారు. మరో 10మంది వరకు ఎలక్ట్రీషియన్లుగా కొనసాగుతున్నారు. దాదాపు 50మంది వరకు రాష్ట్ర స్థాయి కళాకారులుగా ప్రదర్శనిలిచ్చి ఉపాధి పొందుతున్నారు. మరో 150మంది వరకు నాటు బళ్లు తయారు చేసుకుని, భవన నిర్మాణాలకు ఇసుక సరఫరా చేసి సంపాదించుకుంటున్నారు. మరికొంతమందైతే కొత్తూరు, చుట్టూ పక్కల ప్రాంతాల్లో వస్త్ర దుకాణాలు పెట్టి స్వయం ఉపాధి పొందు తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక రంగా ల్లో ఇక్కడ యువత సత్తా చాటి, తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు.

పోటీ తత్వం ఉంది



గ్రామంలోని యువతకు పోటీతత్వం ఉంది. గ్రామంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారిని చూసి మేము కూడా అంతకంటే ఉన్నతమైన ఉద్యోగం సాధించాలన్న పోటీ ఉంది. దీని వల్లనే చాలా మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అందులో నేనూ ఉన్నాను.

– చెడవరపు జయలక్ష్మి, ఎస్‌జీటీ, కుంటిభద్ర గ్రామం

కష్టపడే తత్వం అందరిలో ఉంది..



మా గ్రామంలోని యువతది కష్టపడే తత్వం. ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాం. తల్లిదండ్రుల మాటలు పిల్లలు వినడం వల్ల మంచి భవిష్యత్‌ను అందుకుంటున్నారు. ఎవరి మీదా ఆధారపడకుండా స్వయంగా కష్టపడాలన్న ఆలోచనతో ముందుకు వెళ్తున్నారు.

– ప్రశాంత్ కుమార్ పాడి, ఏసీటీఓ, విశాఖపట్నం, కుంటిభద్ర గ్రామం

గ్రూప్ 4 ఉద్యోగుల సమస్యలపై చర్చ


సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

జయపురం: సబ్ డివిజన్ పరిధిలోని గ్రూప్ 4 ఉద్యోగల సమావేశం జయపురం టౌన్ హాలులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నందకిశోర్ సాహు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించారు. ఉద్యోగి మృతిచెందితే వారి కుటుంబంలోని వ్యక్తికి భరోసా కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల పనిచేస్తున్న వారిపై అధిక భారం పడుతోందన్నారు. అలాగే పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానించారు. డిమాండ్ల సాధనకు ఆందోళనకు సంసిద్ధం కావాలని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేసారు. అలాగే జూన్ 4న సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. అనంతరం సంఘం కార్యదర్శి సూర్యనారాయణ జాని వార్షిక నివేదికను సమర్పించారు. సమావేశంలో సంఘం సలహాదారు జగదీష్ త్రిపాఠి, సభ్యులు పాల్గొన్నారు.

యువతలో చైతన్యం కోసం జాగృతి

- మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ రాధిక
- వర్చువల్‌గా హాజరైన పీవీ సింధు


జాగృతి కార్యక్రమం కోసం మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : చట్టాలపై అవగాహన లేకనే యువత నేరాలకు పాల్పడుతున్నారని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. మహిళల భద్రత, ప్రజా పరిరక్షణకు ఎన్నో వినూత్న ఆవిష్కరణలు, కార్యక్రమాలు చేపట్టిన ఎస్పీ రాధిక యువతను జాగృత పరిచే మరో అపురూప కార్యక్రమం 'జాగృతి-యువత కోసం' అనే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. అరసవిల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువతను చెడు అలవాట్లకు దూరంగా ఉంచి బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో 15-25 ఏళ్ల లోపు వయసున్న 12 వేల మంది యువతీ యువకులకు వివిధ చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, సైబర్ నేరాలు, పోలీసుల విధులపై ఐదురోజుల పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్‌లో సీనియర్ అధికారులు, నిపుణులతో అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో అధికారులు తెలిపిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు.

జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం యువతకు అనేక ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, ప్రతి ఒక్కరూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ జాగృతి కార్యక్రమంలో శిక్షణ పొందిన యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ద్వారా వివిధ అంశాలపై తర్ఫీదునిచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అదనపు ఎస్పీ టీపీ విఠలేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులను గౌరవిస్తూ మంచి భవిష్యత్‌వైపు యువత దృష్టి మళ్లించాలన్నారు.

నేర నియంత్రణకు కృషి: పీవీ సింధు


వర్చువల్ విధానం ద్వారా సందేశాన్నిస్తున్న పీవీ సింధు

శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ యువత కోసం మంచి కార్యక్రమాన్ని ప్రారంభించిందని, దీన్ని సద్వినియోగం చేసుకుని నేర నియంత్రణకు అంతా కృషి చేయాలని బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు పేర్కొన్నారు. జీవితంలో ప్రతి అంశాన్ని చాలెంజ్‌గా తీసుకుని ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు. ఈమెతో పాటు సినీ ప్రముఖులు సుహాస్, కిరణ్‌కుమార్‌లు వర్చువల్‌గా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొబైల్స్, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐదు రోజుల శిక్షణ కాలానికి సంబంధించిన అంశాలపై రూపొందించిన బుక్‌లెట్‌ను ఎస్పీ, ఇతర అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ కిరణ్‌కుమార్, సెట్ శ్రీ సీఈఓ ప్రసాదరావు, డీఎస్పీలు శృతి, బాలరాజు, శ్రీనివాస్, ప్రొఫెసర్ ఎన్ అప్పన్న, సీఐలు పప్పల శ్రీనివాసరావు, ఎస్.వి.రమణ, సన్యాసి నాయుడు, ఎస్ఐలు గణేష్, విజయ్‌కుమార్, సందీప్‌కుమార్, మహిళా పోలీసులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర రహిత సమాజంతోనే ప్రగతి


మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: నేర రహిత సమాజంతోనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 'జాగృతి -యువత కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా యువత నేరాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రస్తుతం ఉన్నత విద్య అందుబాటులో ఉందని, అనేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదరికం నుంచి బయటపడాలంటే చదువు ఒక్కటే మార్గమని చెప్పారు. విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాలకు అవకాశం లేకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ యువత జాతి సంపదని చెప్పారు. వ్యక్తిగత క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఎస్సై వి.సత్యనారాయణ మాట్లాడుతూ నేరాలకు, మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, విలువైన భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. కేసుల్లో ఇరుక్కుపోతే విలువైన జీవితం నష్టపోతారని చెప్పారు.

ఈదురు గాలుల బీభత్సం


ఈదురు గాలులకు నేలకూలిన గేట్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఇచ్ఛాపురం: అనుకోకుండా వచ్చిన ఈదురుగాలులు ఇచ్ఛాపురంలో బీభత్సం సృష్టించాయి. మంగళవారం ఉదయం నుంచి ఎండ తాపానికి తట్టుకోలేక ప్రజలు ఇబ్బంది పడ్డారు. సాయంత్రానికి వాతావరణం చల్లబడింది. అంతా ఆనందించేలోపే ఈదురు గాలులు భయపెట్టేశాయి. బెల్లుపడ కాలనీలో కె.పాపారావు ఇంటి గోడ కూలి అతని ద్విచక్రవాహనం ధ్వంసమైంది. తారకేశ్వర వీధిలో పాండవ మోహిని ఇంటి రేకు గాలికి ఎగిరి తలపై పడడంతో తీవ్ర గాయమైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా 30 కుట్లు పడ్డాయి.

గ్రామదేవత ఉత్సవాల కోసం ఏర్పాటుచేసిన గేట్లు కూలిపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. తహసీల్దార్ గురుప్రసాద్, ఆర్ఐ శ్రవణ్ సిబ్బంది ఈదురు గాలులకు గాయాలపాలైన మహిళను పరామర్శించి వివరాలు సేకరించారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం


బి.వీరభద్రరావు, జిల్లా అగ్నిమాపక అధికారి

శ్రీకాకుళం క్రైమ్ : రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్నందున అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.వీరభద్రరావు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అడవుల్లో కార్చిచ్చులు జరిగే అవకాశమున్నందున మేకలు, పశువుల పెంపకందారులు, వేటకు వెళ్లేవారు, వంటచెరకు తెచ్చుకునే వారిని వలంటీర్లు, ఫారెస్టు బీట్ సిబ్బంది అప్రమత్తం చేయాలన్నారు. సిగరెట్లు, బీడీలు, అగ్గిపెట్టె వంటివి ఉన్నాయా లేదా అన్నది తనిఖీ చేస్తే మంచిదన్నారు. బొగ్గు కాల్చేవారు, పోడు వ్యవసాయం చేసేవారు అడవులకు వెళ్లే మార్గంలో చెత్తా చెదారాలున్న చోట నిప్పు వెలిగించవద్దని చెప్పారు. ఫైర్ ఇంజిన్లు వెళ్లలేని చోటకు ఫైర్ బీట్స్ సహాయంతో మంటలు ఆర్పేలా సన్నద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ వాడకం ఎక్కువగా వినియోగిస్తున్నందున షార్ట్ సర్క్యూట్ అయి ప్రమాదాలు సంభవించే అవకాశముందని, ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఈ నెలాఖరు వరకు గడువు పొడిగింపు

పార్వతీపురం: ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వరకు గడువును పొడిగించినట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సీహెచ్.రాజేంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైనవారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్ఏయూ.ఇడియు.ఇన్‌లో చూడాలని స్పష్టం చేశారు.

పోలీస్ సేవలు భేష్



రోడ్డుపై ఉన్న చెట్లను తొలగిస్తున్న పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ ఈదురుగాలులు, వర్షానికి రోడ్లకు ఇరువైపులా ఉన్నచెట్లు పడిపోవడంతో పోలీసులు రంగంలోకి దిగి విస్తృతమైన సేవలందించి, ప్రజల మెప్పును పొందారు. పోలీస్ గ్రౌండ్స్ పక్కన ఉన్న విజయనగరం గజపతినగరం రాష్ట్ర రహదారిపై చెట్లు పడిపోవడంతో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి ఆధ్వర్యంలో వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు, ఆర్ఎస్సైలు ప్రసాద్, రామకృష్ణ, సిబ్బంది క్షణాల్లో చర్యలు చేపట్టి, రోడ్డుపై వాహనాల రాకపోకలను పునరుద్ధరించి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టారు.

ఉపాధ్యాయుడి అవతారమెత్తిన ఎంపీడీఓ

వేపాడ: ఎంపీడీఓ కేఎస్ఎస్ పట్నాయక్ ఉపాధ్యాయుడి అవతారమెత్తి స్థానిక ఆదర్శపాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అందించారు. ఆదర్శపాఠశాలలో పదోతరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను కలెక్టర్ ఆదేశాల మేరకు సందర్శించిన ఆయన గణితం బోధించారు. విద్యార్థుల అనుమానాలు నివృత్తి చేశారు. సప్లిమెంటరీ పరీక్షల్లో బాగా రాసి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు

- ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి

విజయనగరం ఫోర్ట్: అకాల వర్షం, భారీ ఈదురు గాలుల కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయని విద్యుత్‌శాఖ ఈఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. 15 విద్యుత్ స్తంభాలు నేలకు ఒరిగిపోయాయని, 18 పోల్స్ దెబ్బతిన్నాయని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు 250 మంది విద్యుత్ సిబ్బందితో పనులు చేపట్టినట్లు చెప్పారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రి చోరీ

బాడంగి: మండలంలోని గజరాయునివలసలో 25 కేవీ త్రిఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సామగ్రిని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయినట్టు విద్యుత్ శాఖ ఏఈ టి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైర్ వైండింగ్ లేకపోవడంతో అందులోని కరెంటు ఆయిల్, సిల్వర్ వైర్ మరికొంత సామగ్రి దొంగలించుకుపోయినట్టు గుర్తించామని తెలిపారు. గుర్తించిన సామగ్రి విలువ సుమారు రూ.3లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ జయంత్ దర్యాప్తు చేస్తున్నారు.


గిరిజన యువతి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన సుజాత

గుమ్మలక్ష్మీపురం: తల్లిదండ్రులు మందలించారన్న మనస్తాపంతో ఓ గిరిజన యువతి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎల్విన్‌పేట ఎస్ఐ షణ్ముఖరావు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ పంచాయతీ ఒడ్రుబంగి గ్రామానికి చెందిన మండంగి సుజాత (19) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని ప్రేమిస్తోంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు యువతిని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని మృతిచెందింది.

అన్నదమ్ముల కొట్లాట



చికిత్స పొందుతున్న శంకరరావు

పార్వతీపురం: తాగునీరు పట్టుకుంటున్న సమయంలో అన్నదమ్ముల నడుమ గొడవ జరిగింది. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం చినబొండపల్లి గ్రామంలో ఇంటి ముందున్న కుళాయి నీరు పట్టుకుంటున్న సమయంలో అన్నయ్య సాంబశివరావును తమ్ముడు సంచాన శంకరరావు అన్ని నీళ్లు నువ్వే పట్టుకుంటున్నావు. మాకు ఒక బిందెకు అయినా నీరు ఇవ్వవా అని ప్రశ్నించాడు. అంతలో అన్నయ్య సాంబశివరావు, శంకరరావును పీకపట్టుకుని కొట్టాడు. అంతటితో ఆగకుండా సాంబశివరావు కుమారుడు గౌరీశంకరరావు వచ్చి కర్రతో కొట్టాడు. దీంతో పలుచోట్ల శంకరరావుకు గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆటోలో చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు సంఘటనల్లో పలువురి మృతి

ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆయా సంఘటనలపై మృతుల బంధువులు, పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాలిలా ఉన్నాయి.

– సాక్షి నెట్‌వర్క్

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



సీతంపేట: మృతి చెందిన అభిషేక్

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గ గ్రామానికి చెందిన పసుపురెడ్డి అభిషేక్(19) సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తన స్వగ్రామమైన చిన్నబగ్గ నుంచి కొత్తూరు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మార్గమధ్యంలో బడిగాం సమీపంలో వాహనం అదుపు తప్పడంతో రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో ప్రాంతీయ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. అభిషేక్ గత సంవత్సరం సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో చదువు పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు.

హోంగార్డు హఠాన్మరణం



వంగర: మృతిచెందిన ప్రకాశం

వంగర: మండల పరిధి సంగాం గ్రామానికి చెందిన వెలగాడ ప్రకాశం(52) వంగర పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తుండగా శ్రీహరిపురం గ్రామంలోని ఉపాధిహామీ చెరువు వద్ద బందోబస్తు కోసం వెళ్లాడు. మధ్యాహ్నం 3గంటల సమయంలో సంగాంలోని ఇంటికి చేరుకుని గ్లాసుతో నీళ్లు తాగి సేదతీరుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతిచెందాడు. మృతుడికి భార్య రోజాతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పాము కాటుతో బాలుడు..

గుర్ల: మండలంలోని చోడవరంలో పాము కాటుకు గురై గరివిడి మండలం వెదుళ్లవలసకు చెందిన అల్లు చరణ్ (11) మృతిచెందాడు. చోడవరంలోని తాతగారింటికి పది రోజుల కిత్రం చరణ్ వచ్చాడు. స్నేహితులతో కలిసి ఇంటి దగ్గరలోని కళ్లాల్లో ఆడుతుండగా దగ్గరలో ఉన్న తాటి చెట్లలో నుంచి పాము వచ్చి కాటు వేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆటోలో ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

చికిత్స పొందుతూ మహిళ..



గంట్యాడ: వరలక్ష్మి మృతదేహం

గంట్యాడ: మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన యర్రావు వరలక్ష్మి(49) ఈనెల 5వతేదీన పాము కాటుకు గురవడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

చెరువులో పడి వృద్ధుడు..

భోగాపురం: మండల కేంద్రంలోని సింగాల చెరువులో పడి గుర్తు తెలియని వృద్ధుడు(50) మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పంచనామా నిర్వహించారు. ఈ సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పిడుగుపడి వ్యక్తి



జామి: అప్పారావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్సై

జామి: మండలంలోని కె.భీమసింగి గ్రామానికి చెందిన పొండ్రంకి అప్పారావు(40) పిడుగుపడి మృతిచెందాడు. పశువులను పొలంలోకి తీసుకుని వెళ్లగా ఆ సమయంలో వర్షంతో పాటు పిడుగుపడడంతో మృతిచెందాడు. మృతునికి భార్య కొండమ్మ, కుమారుడు నవీన్ ఉన్నారు.

పరుగు పందెంలో ఆగిన ఊపిరి



వీరఘట్టం: దర్రు రాజేష్

వీరఘట్టం: మండలంలోని ఎం.రాజపురం గ్రామానికి చెందిన దర్రు రాజేష్(21) పరుగు పందెంలో ఊపిరి వదిలాడు. సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగం కోసం మంగళవారం అనకాపల్లిలో నిర్వహించిన పరుగు పందెంలో రాజేష్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే అక్కడ ఉన్నవారు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.



ఈదురుగాలుల ధాటికి విజయనగరం పైడితల్లి ఆలయం వద్ద చెల్లాచెదురుగా పడిన షామియానాలు



రాజాం సిటీ: వడగళ్లను అరచేతిలో చూపుతూ...



ఎల్.కోట మండలం చందులూరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా నేల కూలిన చింత చెట్టు



లక్కవరపుకోట మండల భూమిరెడ్డిపాలెం గ్రామం సమీపంలో నేలకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గాలివాన..

విజయనగరం జిల్లాలో మంగళవారం ఉదయం భానుడు భగభగ మండగా... సాయంత్రం వరుణుడు వర్షపు జల్లులతో వాతావరణాన్ని చల్లబర్చాడు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. కొన్నిచోట్ల చెట్లు నేలకూలాయి. గుడారాలు, రేకుల షెడ్లు ఈదురు గాలుల ధాటికి ఎగిరిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

– రాజాంసిటీ/సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

సంక్షేమం అమలులో చరిత్ర

- అర్హత కలిగిన వారందరికీ పథకాలు
- గడపగడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ చైర్మన్, ఎంపీ



ఆకులపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: దేశ చరిత్రలో చిరకాలం నిలిచిపోయే విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లు అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలో గల ఆకులపేట గ్రామంలో మంగళవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఆ ఇంట్లో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు, నాలుగేళ్లలో ఏఏ పథకాలు వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యాయో వారికి తెలియపరిచారు. పథకాల మంజూరులో గాని, తీసుకున్నప్పుడు ఎవరికైనా ఒక్క రూపాయి లంచం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఎవరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వలేదని లబ్ధిదారులు బదులిచ్చారు.

98 శాతం హామీల అమలు

అంతకుముందు వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో, మేనిఫెస్టోలో పొందు పరిచిన హామీల్లో 98 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకొచ్చి పారదర్శక పరిపాలన సాగిస్తున్నారన్నారు. అర్హత ఉండి ఇంకా సంక్షేమ పథకాలు అందుకోని వారెవరైనా ఉంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, గిరిడ రాందాసు, పతివాడ రాజారావు, మీసాల సాయి, మీసాల సత్యనారాయణ, కొసిరెడ్డి రమణ, వలిరెడ్డి లక్ష్మణ, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, వెలుగు ఏపీఎం ఎంవీ రాజశేఖర్, మండల ఇంజినీరింగ్ అధికారి డి.రమేష్, మేజర్ పంచాయతీ అధికారి యూనీస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అందరూ ఉత్తీర్ణులు కావాలి

- ఇంటర్‌మీడియట్ ప్రత్యేక తరగతులపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: ఇటీవల జరిగిన ఇంటర్‌మీడియట్ పరీక్షల్లో ఫెయిల్ అయిన ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు క్రమం తప్పకుండా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, అత్యంత శ్రద్ధ వహించి అందరూ పాస్ అయ్యేలా కృషి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ విద్యాశాఖ పరిధి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నింపి ఈ నెల 24 నుంచి జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా వృత్తి విద్యా అధికారి, గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్, ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ సమన్వయ అధికారులతో ఆమె తన చాంబర్లో మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. మెరుగైన ఫలితాలు సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పేర్కొంటూ పలు సూచనలు చేశారు. అన్ని రకాల వసతులను సమకూరుస్తూ సబ్జెక్ట్ నిపుణుల చేత ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తూ వారిలో విశ్వాసం నింపాలని సూచించారు. దూరప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు వారికి సమీపంలో ఉన్న స్టడీ కేంద్రాలను వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ కమ్ కాలేజీస్ ఉన్నచోట అస్సలు ఫెయిల్ కావడానికి వీలులేదని..ఉత్తమ ర్యాంకులు సాధించేలా శ్రద్ధ వహించాలని చెప్పారు. తరగతులతోపాటు విద్యార్థులతో ఆటలు ఆడించాలని సూచించారు. అందరూ సమన్వయంగా కృషి చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా కళాశాల్లో మౌలిక వసతులు, సదుపాయాలపై ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి లింగేశ్వరరెడ్డి, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి సురేష్ కుమార్, గురుకులాల జిల్లా కో–ఆర్డినేటర్ చంద్రావతి, తాటిపూడి ఏపీఆర్‌జేసీ కళాశాల ప్రిన్సిపాల్ శారదా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక పుష్పాలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు పుష్పాలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావి చెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

వైభవంగా ముగ్గురమ్మల పండగ

- భక్తుల ఆనందోత్సాహాల మధ్య గ్రామదేవతల సిరిమానోత్సవం



సిరిమానుకు కొబ్బరి కాయ కొడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



సిరిమానుపై పూజారిని సిద్ధం చేస్తున్న దృశ్యం



సిరిమాను ప్రారంభ కార్యక్రమానికి హాజరైన భక్తులు



పుర వీధుల్లో ఊరేగుతున్న సిరిమాను

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ దేవతలు, ముగ్గురమ్మలైన దేశమ్మ, మెట్టమ్మ, బంగారమ్మ తల్లుల సిరిమానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.మంగళవారం జరిగిన సిరిమానోత్సవానికి బొబ్బిలి చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామం నుంచి సిరిమాను పూజారిని సిరిమాను ఉండే ఆలయం వద్దకు మేళతాళాలతో భక్తులు తోడ్కొని వచ్చారు. మధ్యాహ్నం 3.45 గంటలకు నగిరేశ్వర ఆలయం వద్ద పూజారి పువ్వల సత్తియ్య సిరిమానును అధిరోహించారు. నగిరేశ్వర స్వామి ఆలయం వద్ద పూజారిని సిరిమానుపై అధిష్ఠింప చేశారు. సిరిమానును అరటిగెలలు, పసుపు కుంకుమలతో అలంకరించారు. అక్కడి నుంచి భక్తుల జయజయధ్వానాల మధ్య సిరిమాను కదిలింది. అంతకు ముందు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు తదితరులు సిరిమాను వద్ద కొబ్బరికాయ కొట్టి పూజలు చేసి, అమ్మవార్లను కొలిచారు. అక్కడి నుంచి సిరిమాను పెంట గ్రామ పురవీధుల్లో ఊరేగింది. మధ్యలో పలు చోట్ల భక్తులకు పూజారి సత్తియ్య ఆశీర్వచనాలు అందజేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సిరిమానోత్సవం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, పలు విచిత్ర వేషధారణలు ప్రజలను అలరించాయి. స్టేజి ప్రదర్శనలతో భక్తులను కళాకారులు ఆకట్టుకున్నారు. స్థానిక యువత డప్పుల ముందు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సీఐ ఎం నాగేశ్వర రావు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల తాకిడి ఎక్కువ కావడం వల్ల గ్రామంలోకి కార్లు, ద్విచక్రవాహనాలు ప్రవేశించిన సమయంలో రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది.దీంతో పోలీసులు తగు చర్యలు తీసుకుని సిరిమాను తిరిగే సమయానికి వచ్చే వాహనాలను గ్రామం బయట నిలిపివేయడంతో తరువాత ట్రాఫిక్ సమస్య సద్దుమణిగింది. గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు తీసుకున్న చొరవతో పెంట గ్రామంలో సిరిమానోత్సవం వైభవంగా ముగిసింది.

రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలి

విజయనగరం ఫోర్ట్: రోగులను 108 అంబులెన్సులో సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ ఉప్పుఅప్పలరాజు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సర్వజన ఆస్పత్రి ఆవరణలో మంగళవారం 108 అంబులెన్సులను పరిశీలించారు. అంబులెన్సుల నిర్వహణను పరీక్షించారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా బోధన

విజయనగరం పూల్‌బాగ్: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందేలా బోధన సాగించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని 1998, 2008 డీఎస్సీల ఎంటీఎస్ ఉపాధ్యాయులకు, 2018 డీఎస్సీ ఎస్జీటీలకు విజయనగరం కస్పా హైస్కూల్‌లో జరుగుతున్న వృత్యంతర శిక్షణ తరగతులను డీఈఓ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెర్న్ ఎ వర్డ్, ఉయ్ లవ్ రీడింగ్, తర్ల్ వంటి కార్యక్రమాలను అమలు చేసి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. చదువుతోనే విద్యార్థుల జీవితాలు బాగుపడతాయని, ఆ లక్ష్యాన్ని నెరవేర్చే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్, డైట్ ప్రిన్సిపాల్ ఎన్. తిరుపతినాయుడు, డైట్ అధ్యాపకుడు డి.ఈశ్వరరావు, డి.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విడిపోయిన ఏనుగుల జంట



పాలకొండ రూరల్: ఇటీవల భామిని మండలం కాట్రగడ–బి వద్ద జరిగిన విద్యుత్ ప్రమాదంలో నాలుగు ఏనుగులు మృత్యువాతపడగా, రెండు ఏనుగులు ప్రమాదం నుంచి బయటపడిన విషయం తెలిసిందే. ఇందులో ఒక ఏనుగు (ఆడది) ఒడిశాలోని కాశీనగర్ అడువుల్లోకి వెళ్లిపోగా, మిగిలిన మగ ఏనుగు భామిని మండలం పాకుడుభద్ర–మనుమకొండ పరిసరాల్లో ఒంటరిగా సంచరిస్తున్నట్టు గుర్తించామని పాలకొండ అటవీశాఖాధికారి కె.తవిటినాయుడు మంగళవారం తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సంచరిస్తున్న ప్రాంతాలవైపు వెళ్లకూడదన్నారు. ఇదే మండలం తాలాడ పరిసరాల్లో సంచరిస్తున్న మరో నాలుగు ఏనుగుల గుంపు కూడా ఒడిశా అడువుల్లోకి వెళ్లిపోయినట్టు తెలిపారు. అయితే, ఇవి ఏ క్షణమైనా తిరిగి వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తతతో మెలగాలన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో సత్తా చాటిన బాలికల జట్టు



రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జిల్లా బాలికల జట్టు

- ఈ నెల 13 నుంచి 15 వరకు అనంతపురంలో జరిగిన పోటీలు

తెర్లాం: రాష్ట్రస్థాయి 5వ సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో విజయనగరం ఉమ్మడి జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ బేస్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికల జట్టు ప్రథమ స్థానంలో నిలించింది.

ఈ పోటీల్లో ప్రకాశం జిల్లా ద్వితీయ, చిత్తూరు జిల్లా జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. జట్టు సభ్యులను జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, ఉల్లిభద్ర పీడీ బైరెడ్డి శ్రీనివాసరావు, తెర్లాం హైస్కూల్ పీడీ బంగారునాయుడు, కోచ్ రాజేష్ అభినందించారు. మరిన్ని పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.